E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

17-04-2025 గురువారం | పేజీలు-6 | హైదరాబాద్ | ekaburu.com



హిందూ ట్రస్టుల్లో ముస్లింలను నియమిస్తారా.. కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు?

2లో

ఇచ్చోడ ప్రభుత్వ పాఠశాలలో విష ప్రయోగం ఘటన.. నిందితుడు అరెస్టు 3లో



సిట్ విచారణకు నాలుగోసారి హాజరైన శ్రవణ్‌రావు 3లో



ఐఏఎస్ స్మితా సబర్వాల్ ను చిక్కుల్లో పడేసిన గిబ్లీ యాప్ 3లో



# కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీం కోర్టు తీవ్ర హెచ్చరికలు

- అనుమతులు లేకుండా చెట్లు తొలగిస్తే జైలుకే: ధర్మాసనం హెచ్చరిక
- 1996 మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే తిప్పలు తప్పవు: జస్టిస్ గవాయ్
- భూముల మార్టిగేజ్‌పై కాదు, అనుమతులపై దృష్టి: సుప్రీం స్పష్టీకరణ



ఈ కబురు ,ఢిల్లీ: హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు లో బుధవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది.

చెట్లు కొట్టేసే ముందు 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారా? లేదా? స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. అనుమతులతోనే ఆ భూముల్లో జామాయిల్ తరహా చెట్లు, పొదలను తొలగించినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ తెలిపారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని.. దాని ప్రకారం ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ చెప్పారు. అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టివేసినట్లు తేలితే సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. 1996 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు ఏమాత్రం విరుద్ధంగా వ్యవహరించినా చూస్తూ ఊరుకోబోమన్నారు.

రూ.10వేల కోట్లకు మార్టిగేజ్ చేశారని సీఈసీ నివేదికలో చెప్పిందని అమికస్ క్యూరీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములను మార్టిగేజ్ చేశారా..

wఅమ్ముకున్నారా? అనేది తమకు అనవసరమని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. చెట్లు కొట్టివేసే ముందు అనుమతి ఉందా? లేదా? అనేది మాత్రమే ముఖ్యమని చెప్పారు. 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి.. ఆ తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి తదితర వివరాలను అభిషేక్ మను సింఘ్వీ వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేసింది.

# తదుపరి సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

**తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్‌ను ప్రస్తుత సీజేఐ సిఫార్సు చేశారు.**



**ఈ కబురు :** తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈమేరకు ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కేంద్ర న్యాయశాఖకు సిఫార్సు చేశారు. జస్టిస్ ఖన్నా పదవీకాలం మే 13న ముగియనుంది. మరుసటి రోజు నూతన సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబర్ 24న భూషణ్ రామకృష్ణ గవాయ్ (BR Gavai) జన్మించారు. 1985లో బార్‌లో చేరిన జస్టిస్ గవాయ్.. 1987 నుంచి 1990 వరకు బాంబే హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. ఆ తర్వాత నాగ్‌పుర్ బెంచ్‌లోనే ప్రధానంగా తన ప్రాక్టీస్ కొనసాగించారు. 1992 నుంచి 1993 వరకు అక్కడే అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. అనంతరం నవంబర్ 12, 2005లో బాంబే హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మే 24, 2019న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ గవాయ్.. ఈ ఏడాది నవంబర్ 23 వరకు సీజేఐగా సేవలందించనున్నారు.

# భూ సమస్యలు లేని తెలంగాణే లక్ష్యం



**ఈ కబురు :** భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా భూభారతి చట్టాన్నితీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందన్నారు. భూభారతి అవగాహన సదస్సులపై గురువారం మంత్రి సమీక్షించారు. చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే భూభారతి అమలుకు పైలట్ ప్రాజెక్ట్‌లుగా ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. నారాయణ్‌పేట జిల్లా మద్దూర్ మండలంలోని కాజాపురం గ్రామంలో భూభారతి పైలట్ ప్రాజెక్ట్‌ను తానే స్వయంగా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆ తర్వాత వికారాబాద్ జిల్లా పూడూరు గ్రామంలో జరిగే అవగాహన సదస్సులో పాల్గొననున్నట్లు తెలిపారు. 18వ తేదీన ములుగు జిల్లా వెంకటాపురంలో ఉదయం జరిగే రెవెన్యూ సదస్సులోనూ, తర్వాత ఆదిలాబాద్ జిల్లాలోనూ జరిగే సదస్సులో పాల్గొంటున్నట్లు చెప్పారు.

**నాలుగు మండలాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు**

నారాయణ్‌పేట్ జిల్లా తరువాయి 3లో

# జపాన్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి


**ఈ కబురు :** ఎనిమిది రోజుల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి జపాన్ చేరుకున్నారు. నిన్న రాత్రి హైదరాబాద్ నుంచి బయలు దేరిన బృందం.. ఈ రోజు మధ్యాహ్నం నారిటా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ఈ నెల 22 వరకు జపాన్‌లో సీఎం బృందం పర్యటన కొనసాగనున్న విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమాలో తరువాయి 3లో



# భారత్‌కు రానున్న జేడీ వాన్స్

**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్‌తో కలిసి ఇటలీ, భారత్‌లను సందర్శించనున్నారు.**

**ఈ కబురు :** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటన ఖరారైంది. సతీమణి ఉషా వాన్స్ తో కలిసి ఇటలీ, భారత్‌లను సందర్శించనున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు తరువాయి 2లో



# స్మితా సబర్వాల్ పోస్టుపై చట్టప్రకారం ముందుకెళ్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

**కంచ గచ్చిబౌలి విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.**

**ఈ కబురు , హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టే చెప్పిందన్నారు. బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

"నకిలీ వీడియోస్, ఫొటోలు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. భూముల విషయం కోర్టుల పరిధిలో ఉన్నందున ఏమీ మాట్లాడలేం. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్టుపై చట్టప్రకారం ముందుకు వెళ్తాం. నెమళ్లు జనావాసాల్లోకి రావడం సర్వసాధారణం. భాజపా, భారాస కలిసే కుట్ర పన్నుతున్నట్లు భావిస్తున్నాం. రాష్ట్ర భాజపా నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే ఈ భూములపై ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారు. కూలగొడితే కూలిపోయే ప్రభుత్వం కాదు మాది" అని శ్రీధర్‌బాబు అన్నారు.



# గ్రీన్ ఎనర్జీలో రూ.29 వేల కోట్ల పెట్టుబడులు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఈ కబురు :** రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీకి ఆకర్షితులై జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాజేంద్ర నగర్ లోని తెలంగాణ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థలో ఆయన సమక్షంలో రూ. 29 వేల కోట్ల పెట్టుబడులకు టీజీ రెడ్కో తో ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జిపిఆర్ఎస్ ఆర్య ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఎంఓయూ చేసుకున్నారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ న్యూ ఎనర్జీ పాలసీ తీసుకురావడంతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దావోస్ వెళ్ళినప్పుడు సన్ పెట్రో కంపెనీ 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి రూ. 20వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఎంఓయు చేసుకున్నదని గుర్తు చేశారు.



అదే విధంగా మెగా కంపెనీ 1500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి రూ. 7500 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చిందన్నారు. ఈ రెండు కంపెనీలు డిపిఆర్ తయారు చేసే పనిలో ఉన్నాయని, కొద్ది రోజుల్లోనే ఈ రెండు కంపెనీలకు చెందిన కొత్త ప్రాజెక్టులు ప్రారంభమైతాయన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీతో రాష్ట్రంలో రూ. 27 వేల కోట్ల పెట్టుబడులతో 5600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడానికి ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకొచ్చి ఎం ఓ యు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కోసం రాష్ట్రంలో వస్తున్న పెట్టుబడులతో ప్రజల విద్యుత్ అవసరాలు అధిగమించే అవకాశం ఉందన్నారు. 2023 సంవత్సరంలో 15,623 మెగావాట్ల గరిష్ట పిక్ డిమాండ్ రాగా, ఈ సంవత్సరం మార్చి 20న 17,162 మెగావాట్ల గరిష్ఠ పీక్ డిమాండ్ చేరుకున్నప్పటికీ పకడ్బందీ వ్యూహంతో ఎలాంటి ఇంట్రప్షన్ లేకుండా నాణ్యమైన విద్యుత్తును వినియోగదారులకు సరఫరా చేశామని చెప్పారు.

**మహానగరం అభివృద్ధితో విద్యుత్‌కు డిమాండ్:**

గ్రేటర్‌నగరం రోజు తరువాయి 2లో



# సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: కేటీఆర్

**కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.**

**ఈ కబురు ,హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 2లో

ఈ-కబురు

17 - 04 -2025
గురువారం

e kaburu.com

# భారత్‌కు రానున్న జేడీ వాన్స్

మొదటి పేజీ తరువాయి

ఈ పర్యటన కొనసాగనుంది. అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం జేడీ వాన్స్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఆయన సతీమణి ఉష తెలుగమ్మాయి అనే విషయం తెలిసిందే.

ఇటలీ, భారత్ పర్యటనల్లో భాగంగా ఆయా దేశాల నేతలతో వాణిజ్య, భౌగోళిక రాజకీయ అంశాలపై జేడీ వాన్స్ చర్చలు జరుపుతారని అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. భారత పర్యటనలో భాగంగా వాన్స్ కుటుంబం దిల్లీ, జైపూర్, ఆగ్రాలను సందర్శించనుంది. ఆయా చారిత్రక ప్రదేశాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననుంది. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీతో జేడీ వాన్స్ భేటీ కానున్నారు. భారత్ అమెరికా వాణిజ్య చర్చల వేళ ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

అమెరికా సెకండ్ లేడీగా తెలుగమ్మాయి.. ఉషా వాన్స్‌ది ఆంధ్రానే!

ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1970ల్లోనే అమెరికాకు వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. యేల్ లా స్కూల్‌లో ఉషా, జేడీ వాన్స్ తొలిసారి కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడి.. 2014లో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భర్త విజయంలో ఉష కీలక పాత్ర పోషించారు. అమెరికా సెకండ్ లేడీ హోదాలో తన పూర్వీకుల దేశానికి రావడం ఆమెకు ఇదే తొలిసారి.

# సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. మే 15 వరకు స్టేటస్ కో పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

''పర్యావరణాన్ని పునరుద్ధరించాలని చెప్పిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికైనా జ్ఞానోదయం కలుగుతుందని ఆశిస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి రూ.10వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతున్నారు'' అని కేటీఆర్ పేర్కొన్నారు.



# అమరావతిపై కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారు: మంత్రి నారాయణ ఆగ్రహం

**రాజధాని అమరావతి పై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.**

**అమరావతి:** రాజధాని అమరావతి పై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రైతుల భూముల ధర నిలవాలన్నా.. పెరగాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని చెప్పారు. బుధవారం మీడియాతో మంత్రి మాట్లాడారు.

''విదేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టాలంటే ఫ్లైట్ కనెక్టివిటీ ఉండాలి. అందుకే అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కట్టాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఎయిర్‌పోర్ట్ కోసం భూసేకరణ లేదా భూ సమీకరణ అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే అమరావతిలో పనులు ప్రారంభం అయ్యాయి. భూములిచ్చిన రైతు సోదరులకు ఎలాంటి అపోహలు వద్దు. ఇచ్చిన మాట ప్రకారం అన్నీ చేస్తాం. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తవుతుంది'' అని పి.నారాయణ తెలిపారు.



# మావోయిస్టులకు మరో షాక్.. తాజా ఎన్ కౌంటర్ లో అగ్రనేతలు మృతి

**ఈ కబురు/భద్రాచలం:**
ఛత్తీస్ గఢ్ దండకారణ్యంలో కాల్పుల మోత కొనసాగతూనే ఉంది. బస్తర అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు కంటిన్యూ అవుతున్నాయి. తాజాగా కొండగావ్‌నారాయణ్ పుర్ సరిహద్దుల్లోని అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోయిస్టు అగ్రనేత, కమాండర్ హల్దార్, ఏరియా కమిటీ సభ్యుడు రామి మృతి చెందినట్లు బస్తర్ ఐజీ పి. సుందర్ రాజ్ బుధవారం తెలిపారు. సమీపంలోని అడవువల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం రావడంతో భద్రతా దళాలు మంగళవారం సాయంత్రం కూంబింక్ నిర్వహించాయి. ఈ క్రమంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పులు జరిగిన ఘటనలో హల్దార్, రామి మృతదేహాలు, ఏకే 47 తుపాకీని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కాగా హల్దార్ పై రూ. 8 లక్షలు, రామిపై రూ. 5 లక్షల రివార్డు ఉన్నట్లు ఐజీ తెలిపారు. తాజా ఎన్ కౌంటర్ తో ఈ ఏడాదిలో ఇప్పటివరకు 140 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్ కాగా వీరిలో ఒక్క బస్తర్ డివిజన్ లోనే 123 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. 2026 మార్చి చివరి నాటికి దేశంలో మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇటీవల తరచూ చెబుతున్న సంగతి తెలిసిందే.

# గ్రీన్ ఎనర్జీలో రూ.29 వేల కోట్ల పెట్టుబడులు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి

రోజుకు అభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న ట్రిబుల్ ఆర్, మూసీ పునర్జీవం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు పెరుగుతాయని కొన్ని సంస్థలు అధ్యయనం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఆ నివేదికల ఆధారంగా 202930 నాటికి 24,215 మెగావాట్ల గరిష్ట డిమాండ్, 2034 35 నాటికి 31 809 మెగావాట్ల గరిష్ట డిమాండ్ పెరుగుతుందని అంచనా వేసి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి ప్రణాళికలు తయారు చేసుకొని ప్రభుత్వం ముందుకెళుతుందని వివరించారు. 2030 నాటికి 20వేల మెగావాట్లు, 2035 నాటికి మరో 20వేల మెగావాట్లు మొత్తం 40 వేల మెగావాట్లు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసుకొని యాక్షన్



ప్లాన్ తో ముందుకుపోతుందన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన న్యూ ఎనర్జీ పాలసీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఉండటంతో చాలామంది రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు.

టీజీ రెడ్కో తో ఎంఓయూ చేసుకున్న ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని, క్యాలెండర్ ఫిక్స్ చేసుకొని నిర్దిష్ట గడువులోగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకురావాలని, ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. 15 జిల్లాల్లో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రెడ్కోతో రూ.2 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఎంఓయూ చేసుకున్న జిపిఆర్ఎస్ ఆర్య ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలను అభినందించారు. రాష్ట్రంలో అత్యధికంగా వరి సాగు అవుతున్న నేపథ్యంలో వరి గడ్డితో తయారు చేసే కంప్రెస్డ్ బయోగ్యాస్ వల్ల రైతులకు ఆర్థికంగా ఉపయోగం జరగాలని సూచించారు.

# తెలంగాణ ఇంటర్ విద్యలో కీలక మార్పులు!

**ఈ కబురు :** ఇంటర్ పరీక్షల విధానంలో మార్పులు చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇప్పటి వరకు ఉన్న పరీక్షల విధానంలో కీలక మార్పులు, సిలబస్ మార్చాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ఇప్పుడున్న 100 శాతం రాత పరీక్షల మార్కుల విధానంలో స్థానంలో 80 శాతం రాత పరీక్షకు, 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ విధానాన్ని 2025-26 అమలు చేస్తామని ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటూ ఇంటర్ బోర్డు లేఖ రాసింది. ఇంటర్‌లో ఇంటర్నల్ మార్కుల విధానంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటర్ విద్యా సంస్థ దాదాపు 90 శాతం ప్రైవేటు కాలేజీ చేతుల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఇంటర్నల్ లకు 20 మార్కులు కేటాయిస్తే ప్రైవేటు కాలేజీల పంట పండినట్లేనని, ఇక ప్రభుత్వ కాలేజీల మూసుకోవాల్సిందేనని, ప్రభుత్వంలో అడ్మిషన్‌లపై తీవ్రప్రభావం చూపు




తుందని, వాటిల్లో చదివితే 20కి 20 మార్కులు వస్తాయని, ఇదే అస్త్రాన్ని ఉపయోగించి వారు అడ్మిషన్‌లు,ఫీజులు పెంచుకునే అవకావం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

పదో తరగతిలో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ఎత్తేసిన ప్రభుత్వం అదే ఇంటర్ కు వచ్చే సరికి 20 శాతం మార్కులను ఎలా కేటాయిస్తుందని విద్యారంగ నిపుణులు, విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ విధానం పూర్తిగా ప్రేవేటు కాలేజీలకు ప్రయోజనం చేకూర్చే విధంగా తీసుకున్నారని ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంటర్‌ప్రాక్టికల్స్ మార్కుల విషయంలో ఏ ప్రభుత్వ కాలేజీలో రాని విధంగా ప్రైవేటు కాలేజీల్లో 100 శాతం మార్కులు వస్తాయని, దీంతో బైపీసీ విద్యార్థులు అత్యధిక ఆ మార్కుల కోసమైన ప్రవేటు కాలేజీల్లో చేరుతారని కొన్ని సంవత్సరాలుగా ఉంది. ఇప్పుడు ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ఇక అంతే సంగతులని, ప్రైవేటు కాలేజీల వ్యాపారం మరింత జోరందుకుంటుందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మార్చిన సిలబస్ అంత సిద్ధమైంది. అమలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి చేయడానికి ప్రభుత్వ అనుమతి కోరినట్లుగా సమాచారం.



# కేవలం ఎన్నికల వరకే బీజేపీతో పొత్తు.. పళనిస్వామి కీలక వ్యాఖ్యలు

**ఈ కబురు:**
తమిళనాడులో అన్నాడీఎంకే, బీజేపీ పొత్తుపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి (Palani swamy) కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో తమ పార్టీ పొత్తు కేవలం ఎన్నికల కోసమేనని, ఎలక్షన్స్‌లో కూటమి విజయం సాధిస్తే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడబోదని తెలిపారు. బుధవారం ఆయన చెన్నయ్ లో మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 11న కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించిందిదిఏఐఏడీఎంకేబీజేపీ కూటమి ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, కానీ దాని అర్థం సంకీర్ణ ప్రభుత్వం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలిస్తే బీజేపీతో అధికారాన్ని పంచుకునే అవకాశం లేదన్నారు. జాతీయ స్థాయిలో ఈ కూటమికి ప్రధాని మోడీ నాయకత్వం వహిస్తారని, తమిళనాడులో మాత్రం నేనే నాయకత్వం వహిస్తానన్నారు. డీఎంకే ప్రభుత్వ వ్యతిరే ఓట్లు చీలిపోకుండా చూసుకునేందుకే ఏఐఏడీఎంకే బీజేపీని తమ కూటమిలోకి చేర్చుకుందన్నారు. పళనిస్వామి వ్యాఖ్యలపై బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నైనార్ నాగేంద్ర స్పందించారు. అమిత్ షా, పళనిస్వామి కలిసి ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

# అమిత్ షాను ప్రధాని మోదీ నియంత్రించాలి: మమత

**వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా బెంగాల్‌లో చెలరేగిన హింసలో హోంమంత్రి అమిత్ షా హస్తం ఉందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు.**

**ఈ కబురు:** : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. వక్ఫ్ (సవరణ) చట్టం 2025కి వ్యతిరేకంగా బెంగాల్‌లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారడంలో ఆయన హస్తం ఉందని ఆరోపించారు. ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన హింస అని.. ఇందుకోసం అమిత్ షా, బీఎస్ఎఫ్ కలిసి కుట్రపూరితంగా బంగ్లాదేశీయులను రాష్ట్రంలోని వదిలారని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష నేతలను భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. సొంత రాజకీయ అజెండాను నెరవేర్చుకోవడానికి దేశానికి హాని చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ.. అమిత్‌షాను నియంత్రించాలని అన్నారు.



ముర్షిదాబాద్ అల్లర్ల వెనుక సరిహద్దు అవతల నుంచి వచ్చిన వ్యక్తుల పాత్ర ఉందని నిఘా వర్గాలు తమకు తెలిపాయని మమత పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లోని ఘర్షణలకు సంబంధించిన దృశ్యాలను బెంగాల్‌లో జరుగుతున్నట్లు చెబుతూ సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దీదీ ఆరోపించారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో తమ పార్టీ ముందంజలో ఉందని అన్నారు. ఈ విషయంపై ప్రజలు శాంతియుత నిరసనలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయొద్దని ప్రధానిని కోరారు. హింసాకాండలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల నష్టపరిహారం ఇస్తామని మమత ఈ సందర్భంగా ప్రకటించారు. ఘర్షణల్లో బీఎస్ఎఫ్ పాత్రపై దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

**వక్ఫ్ చట్టానికి మద్దతుగా సుప్రీంకు 6 భాజపా పాలిత రాష్ట్రాలు**

వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హూగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసం చోటుచేసుకుంది. దీంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా.. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ ఇప్పటికే పదుల సంఖ్యలో పిటిషన్లు దాఖలు అయ్యాయి. వీటిపై సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ చేపట్టనుంది.

## ఐఏఎస్ స్మితా సబర్వాల్ ను
# చిక్కుల్లో పడేసిన గిబ్లీ యాప్

**కంచ గచ్చిబౌలి భూముల ఎక్స్ పోస్టుపై నోటీసులు జారీ చేసిన గచ్చిబౌలి పోలీసులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ను గిబ్లీ యాప్ చిక్కుల్లో పడేసింది. కంచ గచ్చిబౌలి భూములపై గిబ్లీ యాప్ లో రూపొందించిన ఓ పోస్టును ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ వేదికగా స్మితా సబర్వాల్ చేసిన ట్వీట్ పై గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల మార్ఫింగ్ ఫోటోల వివాదం నడుస్తుండగా.. స్మిత సబర్వాల్ కు పోలీసులు నోటీసులు జారీ చేయడం సంచలనంగా మారింది. కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25 లో గల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై వివాదం నెలకొన్న నేపధ్యంలో మార్చి 31వ తేదీన "హాయ్ హైదరాబాద్" అనే ఎక్స్ హ్యాండిల్ గిబ్లీ ఫొటోను పోస్ట్ చేసింది. సదరు ఫొటోలో పనులు చేస్తున్న జేసీబీ లు, వాటి ముందు నెమళ్లు, జింకలు కనిపిస్తున్నాయి. కంచ గచ్చిబౌలి భూముల్లోని మష్రూమ్ రాక్ వద్ద తీసినట్టుగా గిబ్లీ యాప్ లో ఈ ఫోటోను క్రియేట్ చేశారు. హాయ్ హైదరాబాద్ చేసిన ఈ పోస్టును తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ మార్చి 31వ తేదీన తన ఎక్స్ ఖాతాలో రీ పోస్ట్ చేశారు. కాగా కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో నకిలీ ఫోటోలు, వీడియోల మీద దృష్టి సారించిన గచ్చిబౌలి పోలీసులు నకిలీ ఫోటోలు షేర్ చేసిన స్మిత సబర్వాల్ కు బీఎన్ఎస్ 179 సెక్షన్ కింద ఈ నెల 12న నోటీసులు జారీ చేశారు.


స్మిత సబర్వాల్




## గచ్చిబౌలిలో 250 గ్రాముల
# గంజాయి స్వాధీనం

**యువకుడు అరెస్ట్**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
గచ్చిబౌలి ఐటీ కారిడార్ లో గంజాయి తరలిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్సై అనిత కథనం ప్రకారం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన కే రంజిత్ (21) నగరానికి వలస వచ్చి జెప్టో బాయ్ గా పని చేస్తున్నాడు. షామీర్ పేట్ మండలంలోని కేశవరంలో ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసిన రంజిత్ గచ్చిబౌలి కి వచ్చాడు. గచ్చిబౌలి ఇందిరా నగర్ బస్ స్టాప్ వద్ద ఉన్న రంజిత్ ను విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు అదులులోకి తీసుకొని తనిఖీ చేయగా, రంజిత్ వద్ద 250 గ్రాముల గంజాయి లభించింది. ఈ మేరకు నిందితుడిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





## సిట్ విచారణకు
## నాలుగోసారి హాజరైన శ్రవణ్‌రావు

**ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్‌రావు నాలుగోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఆయన విచారణకు వచ్చారు.**

**ఈ కబురు :** హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్‌రావు నాలుగోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఆయన్ను విచారించారు. గతేడాది మార్చి 29న శ్రవణ్‌రావు విదేశాల నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ఈక్రమంలో పలుమార్లు సిట్ విచారణకు హాజరయ్యారు. నేడు ఆయన ఫోన్లలోని డేటాను అధికారులు రీట్రీవ్ చేస్తున్నారు. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు.. దాని వల్ల జరిగిన లబ్ధిపై అధికారులు ఆరా తీస్తున్నారు. శ్రవణ్‌రావు ఇచ్చిన వివరాలను బట్టి భవిష్యత్తులో కొందరు రాజకీయ నేతలను విచారించే అవకాశం ఉంది.

గతంలో శ్రవణ్‌కుమార్ సిట్ విచారణకు హాజరైనప్పుడు ఫోన్‌ను సమర్పించాలని దర్యాప్తు అధికారులు ఆదేశించారు. అనంతరం ఆయన ఫోన్ తెచ్చినప్పటికీ అందులో ఏ సమాచారమూ లేకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. ఈక్రమంలో నేడు ఫోన్లలోని డేటాను అధికారులు

## హిందూ ట్రస్టుల్లో ముస్లింలను నియమిస్తారా..
# కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు?

**ఈ కబురు ,:** హిందూ మతానికి సంబంధించిన ట్రస్టుల్లో ముస్లింలను భాగం చేస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, బోర్డుల్లో ముస్లిమేతరులను చేర్చడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇక నుంచి ముస్లింలను కూడా హిందూ ఎండోమెంట్ బోర్డుల్లో భాగం చేసుకోవడానికి అనుమతిస్తానని మీరు చెబుతున్నారా? అలా అయితే ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పండి’ అని ప్రశ్నించింది. వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వక్ఫ్ చట్టానికి తీసుకువచ్చిన మార్పుల ద్వారా ప్రభుత్వం గత చరిత్రను రద్దు చేయలేదని తెలిపింది. చాలా కాలం క్రితం వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను డీనోటిఫై చేయడానికి కొత్త చట్టం కింద ఉన్న పరిధిని ధర్మాసనం ప్రస్తావిస్తూ.. 200 ఏళ్ల క్రితం ఒక పబ్లిక్ ట్రస్ట్‌ను వక్ఫ్‌గా ప్రకటించినప్పుడు.. అకస్మాత్తుగా దానిని వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకుంటోందని ఎలా చెబుతారని నిలదీసింది.



**వక్ఫ్ బై యూజర్ ఆస్తులను డీనోటిఫై చేయొద్దు**
కోర్టులు వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను విచారణ సమయంలో డీనోటిఫై చేయొద్దని ధర్మాసనం తెలిపింది. జిల్లా కలెక్టర్ దర్యాప్తులో ఉన్నప్పుడు ఆస్తులను వక్ఫ్‌గా పరిగణించకుండా నిరోధించే నిబంధనను కూడా నిలిపివేసింది. ‘సుదీర్ఘకాలంగా ముస్లిం కార్యక్రమాలకు వాడుతున్న (వక్ఫ్ బై యూజర్) ఆస్తులను డీనోటిఫై చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయి. వక్ఫ్ బై యూజర్ ఆస్తులను రిజిస్టర్ చేయడం కష్టం. ఇందులో ముస్లిం ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న ఆస్తులు కూడా ఉన్నాయి’ అని వ్యాఖ్యానించింది. ‘ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమిలోనే ఉందని అంటున్నారు. చారిత్రక, పురావస్తు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించడానికి వీలు లేదు. చాలా కాలంగా అక్కడ ఉన్న వక్ఫ్ బై యూజర్‌లను మీరు ఎలా నమోదు చేస్తారు? వారి వద్ద ఏ పత్రాలు ఉంటాయి? అది ఏదో ఒక ఆందోళనకు దారితీస్తుంది’ అని పేర్కొంది. ‘14వ,16వ శతాబ్దాల నాటి మసీదులు ఉన్నాయి. వాటికి రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు ఉండవు. అలాంటి ఆస్తులను ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని’ ప్రశ్నించింది. అలాంటి వక్ఫ్ తిరస్కరణకు గురైతే వివాదం చాలా కాలం పాటు కొనసాగుతుందని నొక్కి చెప్పింది.

**నిరసనలు ఆందోళనకరం**
వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న హింసపై సుప్రీంకోర్టు ఆగ్రహం చేసింది. ఈ అల్లర్లు చాలా ఆందోళన కలిగించే అంశమని తెలిపింది. ప్రస్తుతం ఈ సమస్య కోర్టు పరిగణనలో ఉందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి హింసను ఎంచుకోవద్దని సూచించింది. అయితే పిటిషనర్లు కోరినట్టు వక్ఫ్ సవరణ చట్టం అమలుపై స్టే ఇచ్చేందుకు బెంచ్ నిరాకరించింది. వక్ఫ్ సవరణలపై ఉన్న వివాదాలపై సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ధర్మాసనం మరోసారి విచారించనుంది.

## భూ సమస్యలు లేని
# తెలంగాణే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**

మద్దూర్ మండలం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో ప్రయోగాత్మకంగా భూభారతి చట్టాన్ని ప్రారంభిస్తున్నామని మంత్రి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రయోగాత్మకంగా భూభారతిని అమలు చేసే ఈ నాలుగు మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటికి రశీదులను అందజేస్తామని తెలిపారు. ఇందుకోసం ఒక ప్రత్యేక ఫార్మాట్‌లో దరఖాస్తులను రెడీ చేసినట్లు చెప్పారు. వాటిని రెవెన్యూ సదస్సుకు ముందురోజే ప్రజలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎలాంటి భూసమస్యలు ఉన్నాయి? ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి? వాటిని ఏ విధంగా పరిష్కరించాలి? రానున్న రోజులలో చేపట్టాల్సిన చర్యలు ఏంటి? భూభారతి పోర్టల్‌పై ప్రజాస్పందనను చూసి భవిష్యత్తులో ఏ విధంగా ముందుకెళ్లాలి? అనే విషయంపై చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూముల మినహా ప్రతి దరఖాస్తును మే 1వ తేదీ నుంచి పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఏ రోజుకారోజు కంప్యూటర్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు.

**ఓ వైపు రెవెన్యూ సదస్సులు.. మరోవైపు అవగాహన సదస్సులు**
ఒకవైపు నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూనే మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. ఈ అవగాహన సదస్సులకు కలెక్టర్లు ప్రతిరోజూ రెండు కార్యక్రమాలలో పాల్గొనే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ తదితర అధికారులతో బృందాలుగా ఏర్పడి సదస్సులు నిర్వహించాలని సూచించారు. అవగాహన సదస్సులు పూర్తయిన తర్వాత ఆ నాలుగు మండలాలలో నిర్వహించిన మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ మినహా అన్ని మండలాల్లో నిర్వహిస్తామని వెల్లడించారు.

# ఇచ్చోడ ప్రభుత్వ పాఠశాలలో
## విష ప్రయోగం ఘటన.. నిందితుడు అరెస్టు

**ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ప్రభుత్వ పాఠశాల వంట గదిలోని నీటిలో పురుగుల మందు కలిపిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.**

**ఈ కబురు , ఇచ్చోడ:**
ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ప్రభుత్వ పాఠశాల వంట గదిలోని నీటిలో పురుగుల మందు కలిపిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల కారణంగానే నిందితుడు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు.

ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 13, 14వ తేదీల్లో సెలవు కావడంతో ఇచ్చోడ మండలం ధర్మపురి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మూసివేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసేసరికి స్కూల్ వంటగదికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని అక్కడి ఉపాధ్యాయురాలు, సిబ్బంది గమనించారు. వంటగదిలో ఉన్న ఒక బకెట్‌లో నీరు తెలుపు రంగులో ఉండటాన్ని వారు గమనించారు. అక్కడి పాత్రలను చూసి అనుమానం వచ్చిన టీచర్ ప్రతిభ.. వెంటనే గ్రామ సర్పంచి, స్థానిక పెద్దలకు సమాచారం ఇచ్చారు. వారు పాఠశాలకు వచ్చి పరిశీలించగా.. నీటిలో పురుగుల మందు కలిపినట్లు గుర్తించారు. ఉపాధ్యాయురాలు ప్రతిభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేశ్ పాఠశాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ధర్మపురికి చెందిన వ్యక్తిపై అనుమానంతో ఆ దిశగా దర్యాప్తు చేశారు.



ధర్మపురి గ్రామానికి చెందిన సోయం కిస్టును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. తానే పురుగుల మందు కలిపినట్లు అంగీకరించాడు. నిర్మల్‌లో ఉన్న తన సోదరుడి ఇంటి నుంచి పురుగుల మందు తీసుకొచ్చి.. పాఠశాల వంట గది తాళాన్ని పగలగొట్టి నీటిలో కలిపినట్లు అంగీకరించాడు. కుటుంబ కలహాల కారణంగా గత కొంతకాలంగా నిందితుడు మానసికంగా ఇబ్బందిపడుతున్నట్లు దర్యాప్తులో గుర్తించాం. తన ఇంట్లో వారిపై ఉన్న కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేశాం. 329(4), 324(6), 331(8), 332 BNS సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం’’ అని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటన వల్ల పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగలేదని ఎస్పీ తెలిపారు.



## జపాన్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

పర్యటించనున్నారు. అలాగే ఒసాకాలో జరిగే ఇండస్ట్రియల్ ఎక్స్‌పో లో సీఎం రేవంత్ పాల్గొననున్నారు. అనంతరం టోక్యోలో పెట్టుబడులపై పలు పారిశ్రామికవేత్తలతో సమావేశం జరగనుంది.

జపాన్ లోని కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ ఆధారిత అభివృద్ధిపై జపాన్ వెళ్లిన సీఎం బృందం అధ్యయనం చేయనుంది. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ కోసం జపాన్ సాంకేతిక అభివృద్ధిని అధ్యయనం చేయడంతో పాటు, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి అక్కడి వ్యాపారవేత్తలను, వివిధ సంస్థలను ఆహ్వానించనున్నట్లు తెలుస్తుంది. ఈ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులు ఉన్నారు.

# ఊహించని ధరకు మోటో నుంచి ఎడ్జ్ 60 స్టైలస్.. ఫీచర్లు ఇవే!



**మోటోరోలా సంస్థ ఎడ్జ్ 60 స్టైలస్ పేరిట కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఏప్రిల్ 23 నుంచి దీని విక్రయాలు ప్రారంభం కానున్నాయి.**

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ మోటోరొలా దూకుడు పెంచింది. ఎడ్జ్ ఫోన్స్‌తో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను క్రియేట్ చేసుకున్న ఈ కంపెనీ.. ఎడ్జ్ 60 సిరీస్‌లో ఫోన్లను ఒక్కొక్కటిగా విడుదల చేస్తోంది. తాజాగా అందుబాటు ధరలో ఎడ్జ్ 60 స్టైలస్‌ను విడుదల చేసింది. సాధారణంగా శాంసంగ్ వంటి కంపెనీలు ప్రీమియం ఫోన్లలో స్టైలస్ సదుపాయాన్ని ఇస్తుంటాయి. మరి మోటో తీసుకొచ్చిన ఈ కొత్త ఫోన్ ధర, ఇతర వివరాలు చూద్దాం.

### ఏమిటీ స్కోర్.. ఫోన్ కొనేటప్పుడు ఈ సంఖ్య చూడాలా?

మోటో ఎడ్జ్ 60 స్టైలస్ 6.7 అంగుళాల 1.5k పీఓఎల్ఈడీ, 120Hz రిఫ్రెష్ రేటు కలిగిన డిస్‌ప్లేతో వస్తోంది. హెచ్‌డీఆర్ 10+ సపోర్ట్ చేస్తుంది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్2 ప్రాసెసర్‌తో వస్తోంది. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 15తో ఈ ఫోన్ పనిచేస్తుంది. రెండేళ్ల పాటు సాఫ్ట్‌వేర్, మూడేళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇవ్వనున్నట్లు కంపెనీ తెలిపింది. ఇక వెనుక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా ఇచ్చారు. 13 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఉంది. 32 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 68W ఫాస్ట్ ఛార్జర్‌కు సపోర్ట్ చేస్తుంది. బాక్సులోనే ఛార్జర్‌ను ఇస్తున్నారు. 15W రివర్స్ ఛార్జింగ్‌కు కూడా సపోర్ట్ చేస్తుంది. ఐపీ68 రేటింగ్, వైఫై 6, డ్యూయల్ స్టీరియో స్పీకర్స్‌తో పాటు 3.5 ఎంఎం జాక్ వంటి సదుపాయాలు ఉన్నాయి.



### వస్తున్నాయ్ పవర్ హౌస్‌లు.. బిగ్ బ్యాటరీతో ఎంట్రీకి స్మార్ట్‌ఫోన్లు రెడీ!

ఇక స్టైలస్ విషయానికొస్తే ఫోన్‌లోనే ఇన్‌బిల్ట్‌గా ఉంటుంది. దీన్ని బయటకు తీయగానే నోట్స్ ఓపెన్ అవుతుంది. దీంట్లో మీకు కావాల్సిన విషయాలు రాసుకుని నోట్స్‌లో సేవ్ చేసుకోవచ్చు. స్కెచ్ టు ఇమేజ్ ఆప్షన్ ద్వారా మీరు డ్రాయింగ్ వేసి దానికి ఇమేజ్ రూపం ఇవ్వొచ్చు. చిన్న చిన్న మ్యాథ్‌మెటిక్ ప్రాబ్లమ్స్‌ను కూడా ఇది పరిష్కరిస్తుంది. సింగిల్ వేరియంట్‌లో ఈ ఫోన్‌ను తీసుకొచ్చారు. 8జీబీ+256 జీబీ వేరియంట్ ధరను రూ.22,999గా కంపెనీ నిర్ణయించిది. యాక్సిస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ లేదా ఎక్స్ఛేంజీ బోనస్ ద్వారా రూ.1000 తగ్గింపు పొందొచ్చు. ఏప్రిల్ 23 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటో వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లలో కొనుగోలు చేయొచ్చు.




## యాంటీ ట్రస్ట్ ట్రయల్.. 1 బిలియన్ డాలర్లతో సెటిల్‌మెంట్‌కు యత్నించిన జుకర్‌బర్గ్




మెటా ) సంస్థ అతిపెద్ద యాంటీ ట్రస్ట్ ట్రయల్‌ను ఎదుర్కొంటోంది. మార్కెట్లో గుత్తాధిపత్యం ఆరోపణల నేపథ్యంలో యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ )ను ప్రశ్నిస్తోంది. అయితే ఈ ట్రయల్‌కు ముందు సెటిల్‌మెంట్ యత్నాలు జరిగాయని అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. విచారణకు ముందు జుకర్‌బర్గ్.. ఎఫ్‌టీసీ ఛైర్మన్ ఆండ్రూ ఫెర్గూసన్‌ను సంప్రదించారని ఆ కథనాలు పేర్కొన్నాయి. తొలుత 450 మిలియన్ డాలర్లు ఆఫర్ చేశారని, అయితే విచారణ సమీపిస్తోన్న సమయంలో ఆ మొత్తాన్ని 1 బిలియన్ డాలర్లకు (భారత కరెన్సీలో రూ.8,569 కోట్లు) పెంచారని సమాచారం. అయితే దానిని ఛైర్మన్ తిరస్కరించారు. ఎఫ్‌టీసీ 30 బిలియన్ డాలర్లు ఆశిస్తోందని, 18 బిలియన్ డాలర్ల కంటే తక్కువ ఏ సెటిల్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి సుముఖత వ్యక్తం చేయలేదని పేర్కొన్నాయి. ట్రయల్‌ను తప్పించుకునేందుకు మెటా సీఈఓ ఒక పిచ్చి ప్రయత్నం చేశారని వెల్లడించాయి.బోయింగ్‌పై చైనా నిర్ణయం భారత్‌కు లాభమా..? పోటీ లేకుండా చేసేందుకు దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ ను మెటా కొనుగోలు చేసిందని ఎఫ్‌టీసీ ఆరోపించింది. సామాజిక మాధ్యమ రంగంలో ఏకఛత్రాధిపత్యం కోసం ఆ కంపెనీ ప్రయత్నిం తమ కంపెనీ పెట్టుబడులు పెట్టకపోయి ఉంటే.. ఆ యాప్స్‌నకు ఇంత ఆదరణ వచ్చేది కాదని మెటా న్యాయవాది తమ ఫైలింగ్‌లో పేర్కొన్నారు. ఒకవేళ, కోర్టు ఉత్తర్వులు మెటాకు వ్యతిరేకంగా వస్తే.. కమిషన్ తీసుకునే నిర్ణయం కీలకం కానుంది. ఇదిలాఉంటే.. 2021లో క్యాపిటల్ భవనంపై ట్రంప్ అనుచరులు దాడి చేయడంతో ఆయన ట్విటర్ (ప్రస్తుతం ఎక్స్), ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ (ఖాతాలపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అనంతరం 2023లో వాటిని పునరుద్ధరించారు. అయితే అంతకుముందే మెటా సంస్థపై ట్రంప్ దావా వేశారు. ఇటీవల దానిని ట్రంప్, జుకర్‌బర్గ్ సెటిల్ చేసుకున్నారు. అదేక్రమంలో ఈ యాంటీ ట్రస్ట్ ట్రయల్‌పై ట్రంప్ నుంచి మద్దతు వస్తుందని మెటా అధినేత ఆశించారు. ఈ గుత్తాధిపత్య దావా విషయంలో జోక్యం చేసుకోవాలని అభ్యర్థించినట్లు సమాచారం.

దిల్లీ: అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. అమెరికాచైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరమవుతుండడంతో సురక్షిత పెట్టుబడిగా భావించి పసిడిపై పెట్టుబడులు మళ్లిస్తున్నారు. అంతర్జాతీయ ధరను అనుసరించి దేశీయంగానూ దీని ధరకు రెక్కలు వస్తున్నాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ఒక్క రోజులోనే రూ.1650 మేర పెరిగి రూ.98,100ను తాకింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి సైతం రూ.1650 మేర పెరిగి రూ.97,650కు పెరిగింది. సాయంత్రం 4.30 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి రూ.97,700కు చేరింది. అటు వెండి ధర సైతం కిలోకు ఒక్క రోజులో రూ.1900 మేర పెరిగి రూ.99,400కు చేరింది. మంగళవారం కిలో వెండి రూ.97,500 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా చూసినప్పుడు ఇంట్రాడేలో గరిష్ఠంగా ఔన్సు 3,318 డాలర్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం 3,296 డాలర్ల వద్ద కొనసాగుతోంది. జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్ అమెరికా, చైనా మధ్య గత కొన్ని రోజులుగా సుంకాల విషయంలో ఘర్షణ నెలకొన్న సంగతి తెలిసిందే. పరస్పరం టారిఫ్‌లు విధించుకోవడంతో పాటు ఎగుమతుల విషయంలోనూ ఆంక్షలు విధించుకుంటున్నాయి. ఈ అనిశ్చితులు కొనసాగుతున్నంత వరకు బంగారానికి డిమాండ్ కొనసాగుతుందని అనలిస్టులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు డాలర్ ఇండెక్స్ బలహీన పడడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న ముందస్తు అంచనాలు కూడా బంగారం ధర పెరగడానికి

# సెన్సెక్స్ హ్యాట్రిక్.. బ్యాంక్ షేర్ల మెరుపులు



దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. ఫైనాన్షియల్ షేర్లు, ప్రధానంగా ప్రైవేట్ బ్యాంకులు, ఎంపిక చేసిన ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో భారత బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజు కూడా విజయ పరంపరను కొనసాగించాయి. అమెరికాచైనా వాణిజ్య యుద్ధం తీవ్రతరం కావడంతో ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాల మధ్య బీఎస్ఈ సెన్సెక్స్ 262 పాయింట్ల లాభంతో 76,996 వద్ద ప్రారంభమైంది. చైనా ప్రతీకార చర్యలకు పాల్పడితే దిగుమతులపై 245 శాతం వరకు సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. సెన్సెక్స్ నష్టాలను పూడ్చుకుని 556 పాయింట్ల లాభంతో 77,110 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరకు 309 పాయింట్లు (0.4 శాతం) లాభంతో 77,044 వద్ద ముగిసింది. ఈ క్రమంలో సెన్సెక్స్ గత మూడు ట్రేడింగ్ సెషన్లలో 3,197 పాయింట్లు లాభపడింది.అలాగే నిఫ్టీ 50 సూచీ 23,273 వద్ద కనిష్టాన్ని, ఆ తర్వాత 23,452 పాయింట్ల వద్ద గరిష్టాన్ని తాకింది. 104.60 పాయింట్లు (4.5 శాతం) లాభంతో 23,433 వద్ద ముగిసింది. నిఫ్టీ గత మూడు రోజుల్లో 1,038 పాయింట్లు పెరిగింది.సెన్సెక్స్ 30 షేర్లలో ఇండస్ ఇండ్ బ్యాంక్ టాప్ గెయినర్ గా నిలిచింది. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో గుర్తించిన వ్యత్యాసాలను ధ్రువీకరించడానికి నియమించిన బాహ్య సంస్థ పీడబ్ల్యుసి తన నివేదికను సమర్పించిన తరువాత ఈ స్టాక్ దాదాపు 7 శాతం పెరిగింది. యాక్సిస్ బ్యాంక్ 4 శాతం లాభపడింది. అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్టెల్, ఎస్బీఐ, ఐటీసీ 1 2 శాతం చొప్పున లాభపడ్డాయి. మరోవైపు మారుతి 1.5 శాతం క్షీణించింది.అదేసమయంలో ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, సన్ ఫార్మా షేర్లు నష్టపోయాయి. విస్తృత సూచీలు ఈ రోజు బెంచ్ మార్క్ ను అధిగమించాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ 0.6 శాతం, స్మాల్ క్యాప్ 0.9 శాతం పెరిగాయి.

# చైనా నడ్డి విరిచేలా అమెరికా కొత్త సుంకాలు




చైనా దిగుమతులపై 245 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఇది అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధాన్ని మరింత పెంచినట్లయింది. ఇప్పటివరకు అమెరికా చైనాపై 145 శాతం సుంకాలు అమలు చేసేలా నిర్ణయం తీసుకుంది. కానీ ఇటీవల ఆ టారిఫ్‌లకు ప్రతిస్పందనగా 125 శాతం సుంకాలతో చైనా పావులు కదపడంతో అమెరికా తీవ్రంగా స్పందించింది. దాంతోపాటు చైనా ఎగుమతి చేసే అరుదైనా ఖనిజాలు, ఇతర వస్తువులపై ఆంక్షలు విధించడం యూఎస్ జీర్ణించుకోలేకపోతుంది. బీజింగ్ ఎగుమతి ఆంక్షలు, ప్రతీకార సుంకాలకు సమాధానం చెబుతూ వైట్‌హౌజ్ తాజాగా విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్‌లో 245 శాతం సుంకాలు పెంచుతున్నట్లు నిర్ణయం తీసుకుంది.

### చైనా తాజా చర్యలు..

చైనా నుంచి అమెరికా వెళ్లే అరుదైన ఖనిజాలు, మాగ్నెట్ల ఎగుమతిని మొత్తంగా నిలిపివేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గాలిడోనియం, సమారియం, స్కాండియం, టెర్బియం, ఇత్రియం, డైస్పోరియం, లుటేటియం వంటివి నిలిపివేత జాబితాలో ఉన్నాయి. దాంతో అమెరికాను చైనా నేరుగా కుంభస్థలంపైనే కొట్టిందని పరిశీలకులు అంటున్నారు. దీని ప్రభావం అమెరికా రక్షణ శాఖపై భారీగా ఉండనుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఫైటర్ జెట్లు తదితరాల తయారీని ఇది తీవ్రంగా ప్రభావితం చేయడం ఖాయంగా కన్పిస్తోంది. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తవుతున్న మొత్తం అరుదైన ఖనిజాల్లో ఏకంగా 70 శాతం వాటా చైనాదే! అమెరికా వాటా 11.4 శాతమే ఉండడం గమనార్హం. ఆర్థిక పరిణామాలు అమెరికా సుంకాలు చైనా ఎగుమతిదారులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. లాభాల మార్జిన్లను గణనీయంగా తగ్గించాయి. కొన్ని సంస్థలు పూర్తిగా ఎగుమతులను నిలిపేశాయి. టెక్స్‌టైల్ కంపెనీలు యూఎస్‌కు ఎగుమతులను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు తెలిపాయి. సుంకాల ప్రభావం వల్ల లాభాలు భారీగా క్షీణించాయని పేర్కొన్నాయి. మరోవైపు వియత్నాం వంటి దేశాలు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. తగ్గిన ఎగుమతి ఆదాయాలు చైనా ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమైన తయారీ రంగాన్ని బలహీనపరుస్తాయి. ఇప్పటికే ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలతో కుదేలైన పారిశ్రామికోత్పత్తి మరింత ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఆర్డర్లు తగ్గడంతో కొన్ని కర్మాగారాలు పరికరాలను విక్రయిస్తున్నాయి.

# ఏఐ కొలువుల్లో భారత్ టాప్

**'కృత్రిమ మేధ (ఏఐ) నిపుణుల నియామకంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలించింది. కానీ, ఈ ప్రతిభను నిలబెట్టుకోవడంలో ఇబ్బందులు పడుతోంది.**



### నిపుణుల కొరతే పెద్ద సవాలు

'కృత్రిమ మేధ (ఏఐ) నిపుణుల నియామకంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలించింది. కానీ, ఈ ప్రతిభను నిలబెట్టుకోవడంలో ఇబ్బందులు పడుతోంది. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, మేధో సంపత్తి హక్కులను పొందడంలో సవాళ్లను ఎదుర్కొంటోంది' అని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ 'ఏఐ ఇండెక్స్ 2025' నివేదిక వెల్లడించింది. 'భారతీయ నిపుణులు ఏఐ నైపుణ్యాలను పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు, వ్యవస్థాపక స్ఫూర్తి ఎంతో బలంగా ఉన్నాయి. అయితే విధాన నిర్ణయాలు, విద్యా వ్యవస్థలో లోటు ఏఐ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయ'ని నివేదిక తేల్చి చెప్పింది. గత ఏడాది ఏఐ ఉద్యోగ నియామకాల్లో భారత్ మొదటి స్థానానికి చేరుకుంది. ఇందులో 33.39% వృద్ధి నమోదయ్యింది. బ్రెజిల్ 30.83%, సౌదీ అరేబియా 28.71 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అమెరికాలో ఇది 24.73 శాతంగానే ఉంది. 2015-24 మధ్య ఏఐ నైపుణ్యాల విస్తృతిలో అమెరికా 2.6 స్కోరుతో ముందుండగా తర్వాతి స్థానంలో 2.5 స్కోరుతో భారత్ ఉంది. ఏఐ సంబంధిత గిట్‌హబ్ ప్రాజెక్టుల్లో 19.9% వాటాతో భారత్ కీలకంగా ఉంది. అమెరికా 23.4%, ఐరోపా 19.5 శాతంతో ఉన్నాయి. ఓపెన్-సోర్స్ ఏఐ అభివృద్ధిలో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఇది సూచిస్తోంది. ఈ సమాచారం లింక్డ్ఇన్ ఆధారంగా తీసుకున్నారు. భారత్‌లాంటి దేశాల్లో దీని వినియోగం అంతగా ఉండదని, కాబట్టి, సమాచారంలో కొంత వ్యత్యాసం ఉండొచ్చని నివేదిక పేర్కొంది.

### పెట్టుబడులు తక్కువే..

ఏఐ నిపుణుల నియామకాలు, సాంకేతికత అభివృద్ధి కార్యకలాపాల్లో భారత్ ఎంతో క్రియాశీలకంగా ఉందని నివేదిక వెల్లడించింది. కానీ, ప్రైవేట్ రంగం నుంచి ఏఐ పెట్టుబడులు సాధించడంలో భారత్ వెనకబడి ఉంది. 2013 నుంచి భారతీయ ఏఐ రంగంలోకి 11.29 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. ఇదే సమయంలో అమెరికా 470.9 బి.డాలర్లు, చైనా 119.3 బి.డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. యూకే 28.2 బి.డాలర్లను 2024లోనే సంపాదించింది. ఏఐ పెట్టుబడుల విషయంలో అమెరికా ఎంతో ముందుంది. 109.1 బి.డాలర్ల పెట్టుబడులను పెట్టింది. ఇది చైనా పెట్టుబడి 9.3 బి.డాలర్లతో పోలిస్తే 12 రెట్లు అధికం.

### అంకురాల్లో చూస్తే..


అంకురాల విషయంలోనూ భారత్ ఏమంత ఆశాజనకంగా లేదు. 2024లో కేవలం 74 ఏఐ స్టార్టప్‌లే ఇక్కడ ఆవిర్భవించాయి. అమెరికాలో 1,073, యూకేలో 116, చైనాలో 98 అంకురాలు వచ్చాయి. ఏఐ పరిశోధనల విషయంలోనూ భారత భాగస్వామ్యం తక్కువే. బాధ్యతాయుతమైన ఏఐపై భారత్ 2024లో 42 పరిశోధనా పత్రాలు సమర్పించింది. అమెరికా 669, చైనా 268 పత్రాలను సమర్పించాయి.ఏఐ మోడళ్ల నాణ్యత విషయంలోనూ చైనా ఎంతో మెరుగ్గా ఉంది. డీప్‌సీక్, క్వెన్, మానస్‌లాంటి ఏఐ మోడళ్లు ఇందుకు తోడ్పడ్డాయి. అమెరికా 40, చైనా 15, యూరప్ 3 వరకు ముఖ్యమైన ఏఐ మోడళ్లను విడుదల చేశాయి. లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, ఆగ్నేయాసియాల నుంచి ఏఐ మోడళ్ల అభివృద్ధి ఎక్కువగా ఉందని స్టాన్‌ఫోర్డ్ నివేదిక పేర్కొంది.

### ఏఐ పాలసీతో..

గత ఏడాది మార్చిలో భారత్ ఏఐ మిషన్‌ను ప్రారంభించింది. ఇందుకోసం 1.25 బి.డాలర్లతో ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం కింద 10,000 జీపీయూలను ప్రారంభించడం, జాతీయ వ్యక్తిగతేతర డేటా ప్లాట్‌ఫామ్‌ను సృష్టించడం, దేశీయ అంకురాలు, ఏఐ మోడళ్లకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. నైతికతతో ఏఐ అభివృద్ధి, ప్రధాన మెట్రో నగరాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఏఐ పరిశోధనా సామర్థ్యాన్ని విస్తరించడమూ ఇందులో భాగమే. ఇతర దేశాలతో పోలిస్తే ఈ పెట్టుబడి స్థాయి ఎంతో తక్కువగా ఉంది. కెనడా 2.4 బి.డాలర్లు, ఫ్రాన్స్ 117 బి.డాలర్లు, సౌదీ అరేబియా 100 బి.డాలర్లతో సెమీ-కండక్టర్ల ఆధారిత ఏఐ అభివృద్ధి కోసం ప్రణాళికలను ప్రకటించాయి.

### గిరాకీకి తగ్గ నైపుణ్యాల కొరత

ఏఐ ఉద్యోగ నియామకాల్లో గణనీయ వృద్ధి కనిపించినప్పటికీ.. భారతీయ రిక్రూటర్లు సరైన ప్రతిభ దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2025 ఫిబ్రవరి లింక్డ్ఇన్ నివేదిక ప్రకారం.. దేశంలో 54 శాతం హెచ్‌ఆర్ నిపుణులు తమకు అందే ఉద్యోగ దరఖాస్తుల్లో సగం లేదా అంతకంటే తక్కువ మంది మాత్రమే అవసరమైన అర్హతలను కలిగి ఉన్నారని చెప్పారు. సాంకేతికత, సాఫ్ట్‌స్కిల్స్ రెండింటినీ ఉన్న అభ్యర్థులను నియమించుకోవడం సవాలేనని పేర్కొన్నారు. ఉద్యోగ అర్హతలో 80% ఉన్న అభ్యర్థులనే తాము పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. ఒక అధ్యయనం ప్రకారం.. 2027 నాటికి భారత్‌కు 23 లక్షల మందికి పైగా ఏఐ నిపుణులు అవసరం. కానీ, ప్రస్తుత నిపుణుల సంఖ్య ప్రకారం 2024లో 8 లక్షలు, 2025 నాటికి 9.40 లక్షలు, 2026 నాటికి 10.8 లక్షల మంది నిపుణులే అందుబాటులో ఉంటారు. అంటే.. ఇంకా 10 లక్షల కంటే ఎక్కువ మంది నిపుణుల కొరత ఉంది. భారతీయ విద్య, నైపుణ్యాభివృద్ధికి ఇది ఒక సవాలు, అదే సమయంలో అవకాశాలను సూచిస్తోంది. ఇప్పటికే ఉన్న ఐటీ నిపుణులు తమ నైపుణ్యాలను 'రీస్కిల్లింగ్' చేసుకోవాల్సిన అవసరమూ కనిపిస్తోంది




# హరి హర వీరమల్లు 'లో అదే హైలైట్ కానుంది..



**పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'హరి హర వీరమల్లు'. ఈ సినిమాలోని ఓ సన్నివేశం గురించి దర్శకుడు తాజాగా ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు.**

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు' క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమాపై జ్యోతికృష్ణ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. దీంతో ఈ మూవీపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. "ఇందులో ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను రూపొందించే బాధ్యత పవన్ కల్యాణ్ తీసుకున్నారు. ఈ సినిమాలో మొత్తం ఆరు యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. 20 నిమిషాలపాటు ఉండే ఒక దాన్ని పవన్ రూపొందించారు. ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఈ సీక్వెన్స్‌లో 1100 మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో 61 రోజులు దీన్ని చిత్రీకరించాం. దీని కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. గ్రౌండ్ వర్క్ చేశారు. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్లతో చర్చించారు . సినిమా మొత్తంలో ఇదే హైలైట్ కానుంది" అని తెలిపారు. ఇక ఈ సినిమా కోసం ఆయన ప్రత్యేకంగా గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నట్లు జ్యోతికృష్ణ తెలిపారు.

అతిథి పాత్రలో ట్రంప్.. తప్ప చేశానంటూ బాధపడుతోన్న దర్శకుడుఇందులో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటిస్తోన్న విషయం తెలిసిందే. ఆమె కూడా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ సినిమాలోని ప్రతి అంశంలో పవన్ భాగమయ్యారని తెలిపారు. రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి భాగం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో మే9న ప్రేక్షకుల ముందుకు రానుంది.





# ప్రభాస్ 'స్పిరిట్'.. వైరలవుతోన్న వార్తలు

**ప్రభాస్ 'స్పిరిట్' సినిమాకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి.**

హీరో ప్రభాస్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో 'స్పిరిట్' రానున్న విషయం తెలిసిందే. దీన్ని అధికారికంగా ప్రకటించిన రోజు నుంచే అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఏ వార్త అయినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ప్రభాస్ ప్రస్తుతం చేస్తోన్న ప్రాజెక్ట్‌లు పూర్తిచేసిన తర్వాత ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ కానున్నారట. మొత్తం 120 రోజులకు పైగా షూటింగ్ జరగనుందని ఈ షెడ్యూల్‌లో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని టాక్. తన లుక్ కోసం జిమ్‌లో వర్క్‌వుట్ చేయనున్నారట. ఇందులో ప్రభాస్ ఇప్పటివరకూ చూడని లుక్‌లో కనిపించనున్నట్లు సమాచారం. తాజాగా యూఎస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సందీప్ వంగా మాట్లాడుతూ దీని షూటింగ్ అప్‌డేట్ పంచుకున్నారు. చిత్రీకరణ కోసం మెక్సికోలోని కొన్ని ప్రాంతాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

# న్యూలుక్‌లో ఖుష్బూ..



సోషల్ మీడియాలో తరచూ తన ఫొటోలు పంచుకుంటుంటారు నటి ఖుష్బూ తాజాగా ఆమె తన న్యూలుక్ ఫొటోలను షేర్ చేశారు. అందులో ఆమె చాలా సన్నగా కనిపించడంతో కొందరు నెటిజన్‌లు ట్రోలింగ్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. సినిమాలో యాక్టింగ్.. అందుకే అంగీకరించా: తమన్ తన తాజా ఫొటోలను షేర్ చేసిన ఖుష్బూ.. "బ్యాక్ టూ ద ఫ్యూచర్"అనే క్యాప్షన్ పెట్టారు. కొందరు ఆమె సన్నబడిన తీరును ప్రశంసిస్తుంటే మరికొందరు మాత్రం 'సన్నగా మారడానికి ఇంజెక్షన్స్ చేయించుకున్నారు. వాటి మేజిక్ వల్లే ఇలా మారిపోయారు. వాటి గురించి ఫాలోవర్స్‌కు కూడా చెప్పండి' అని కామెంట్ పెట్టారు. దీనికి ఆమె స్పందిస్తూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "మీరు ఎలాంటి మనుషులు? మీరెప్పుడు మీ ముఖాలను సోషల్ మీడియాలో చూపించరు. ఎందుకంటే మీరు అంత అసహ్యంగా ఉంటారు. మీ తల్లిదండ్రులను చూస్తుంటే జాలి వేస్తోంది" అని రీట్వీట్ చేశారు. ఇక ప్రస్తుతం ఖుష్బూ సీరియల్స్, సినిమాల్లో నటిస్తున్నారు. ఇటీవలే 'నేసిప్పాయ' అనే తమిళ సినిమాలో కనిపించారు.

# ఎన్ని నిందలు వేసినా ఏమీ అనుకోను : ఏఆర్ రెహమాన్



**ఏఆర్ రెహమాన్ ను ఉద్దేశించి ప్రముఖ గాయకుడు అభిజీత్ ఇటీవల విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మ్యూజిక్ విషయంలో రెహమాన్ ఎక్కువగా టెక్నాలజీపైనే ఆధారపడతారని వ్యాఖ్యానించారు. దీనిపై రెహమాన్ తాజాగా స్పందించారు.**

ముంబయి: ఏఆర్ రెహమాన్ ను ఉద్దేశించి ప్రముఖ గాయకుడు అభిజీత్ ఇటీవల విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీనిని ఉద్దేశించి రెహమాన్ తాజాగా స్పందించారు. ఎన్ని విషయాల్లో తనని తప్పుపట్టినా తాను ఏమీ అనుకోనని అన్నారు. ప్రతిఒక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుందని.. దానిని తప్పుపట్టాల్సిన అవసరం లేదని వెల్లడించారు. "అన్ని విషయాలకు నన్ను తప్పుపట్టడం బాగానే ఉంది. అభిజీత్ నాపై ఎలాంటి విమర్శలు చేసినా నేను ఆయన్ని గౌరవిస్తూనే ఉంటా. ఆయన అంటే నాకెంతో అభిమానం. ప్రేమతో ఆయనకు స్వీట్స్ పంపుతా. నా వర్క్‌పై ఆయనకు ఉన్న అభిప్రాయాన్ని ఆవిధంగా బయటపెట్టారు. దానిని నేను ఏమాత్రం తప్పుపట్టను. ఎందుకంటే ప్రతి విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉంటుంది" అని రెహమాన్ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అభిజీత్ సంగీత రంగంలో వస్తోన్న మార్పులపై స్పందించారు. ఇందులోభాగంగా ఆయన ఏఆర్ రెహమాన్ గురించి మాట్లాడారు. రెహమాన్ ఎక్కువగా టెక్నాలజీపై ఆధారపడుతున్నారని విమర్శించారు. గాయనీగాయకులకు బదులు.. టెక్నాలజీని ఉపయోగించి ఆయన మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారన్నారు. దానివల్ల ఎంతోమందికి ఉపాధి లేకుండా పోతుందని తెలిపారు. ఈ వ్యాఖ్యల పైనా రెహమాన్ మాట్లాడారు. ఇప్పటికే తాను ఒక మహిళా ఆర్కెస్ట్రా బృందాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. "దుబాయ్ వేదికగా ఇటీవల ఒక మహిళా ఆర్కెస్ట్రా బృందాన్ని సిద్ధం చేశా. అందులో సుమారు 60 మంది మహిళలు ఉన్నారు. వారికి ఉద్యోగాలు ఇచ్చి ప్రతి నెలా జీతం ఇస్తున్నా. వాళ్ల కోసం ఆరోగ్య, జీవిత బీమా కడుతున్నా. అంతేకాకుండా 'పొన్నియిన్ సెల్వన్', 'ఛావా' వంటి చిత్రాల కోసం వర్క్ చేసినప్పుడు సుమారు 200 మంది సంగీతకారులను అందులో భాగం చేశా. కొన్నిసార్లు కేవలం పాటల కోసమే 100 మందికి పైగా వర్క్ చేస్తుంటారు. ఆ విషయాలను నేను ఎక్కడా బయటపెట్టను. అలాగే దానికి సంబంధించిన ఫొటోలనూ పంచుకోను. కాబట్టి ఎవరికీ నా వర్కింగ్ స్టైల్ గురించి పెద్దగా అవగాహన ఉండదు" అని ఆయన వివరణ ఇచ్చారు

# హాలీవుడ్‌లోప్రియాంక నవ్వుల చిత్రం



అందం, అభినయంతో సినీ ప్రియులను ఆకట్టుకుంటున్న బాలీవుడ్ కథానాయిక ప్రియాంక చోప్రా. ప్రస్తుతం ఈమె 'ఎస్ఎస్ఎంబీ 29'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో హాలీవుడ్ ప్రాజెక్టులో భాగమైంది. అందం, అభినయంతో సినీ ప్రియులను ఆకట్టుకుంటున్న బాలీవుడ్ కథానాయిక ప్రియాంక చోప్రా . ప్రస్తుతం ఈమె 'ఎస్ఎస్ఎంబీ 29'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో హాలీవుడ్ ప్రాజెక్టులో భాగమైంది. తాజాగా ఈ విషయాన్ని ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టును పంచుకుంది ప్రియాంక. కామెడీ కథా నేపథ్యంలో రూపొందనున్న చిత్రం 'జడ్జిమెంట్ డే'. నికోలస్ స్టోలర్ రూపొందించనున్న ఈ సినిమాలో విల్ ఫెరెల్, జాక్ ఎఫ్రాన్, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. ఈ చిత్రాన్ని గ్లోరియా సాంచెజ్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనుంది.

# అది ఓ అసహ్యకరమైన సంఘటన: చేదు అనుభవం గుర్తుచేసుకున్న మలయాళ నటి

ఓ నటుడు డ్రగ్స్ తీసుకొని తనను ఇబ్బందిపెట్టారని మలయాళ నటి విన్సీ సోనీ వెల్లడించారు. తన జీవితంలో అది ఓ అసహ్యకరమైన సంఘటన అని పేర్కొన్నారు. గతంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు మలయాళ నటి విన్సీ సోనీ అలోషియస్ ఒక సినిమా సెట్స్‌లో హీరో తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. అయితే అతడి పేరును మాత్రం విన్సీ వెల్లడించలేదు.

"సినిమా షూటింగ్ సమయంలో ఆ హీరో డ్రగ్స్ తీసుకున్నాడు. నాతో అనుచితంగా ప్రవర్తించాడు. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు ఎంతో ఇబ్బందిపడ్డా. తన ముందే దుస్తులు మార్చుకోమని ఇబ్బందిపెట్టాడు. అందరి ముందే ఇలాంటి మాటలు మాట్లాడేవాడు. నా జీవితంలో ఇది ఒక అసహ్యకరమైన సంఘటన. దీని తర్వాత ఇక డ్రగ్స్ అలవాటు ఉన్న నటులతో నటించకూడదని నిర్ణయించుకున్నాను. నేను తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బహుశా భవిష్యత్తులో నాకు సినిమాల్లో ఎక్కువ అవకాశాలు రాకపోవచ్చు. కానీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను. ఈ వ్యసనం ఉన్న వారితో నేను నటించను. నాతో అలా ప్రవర్తించిన నటుడి గురించి అందరికీ తెలుసు కానీ ఎవరూ స్పందించలేదు. డ్రగ్స్ తీసుకోవడం అతడి పూర్తి వ్యక్తిగత విషయం కావచ్చు.. కానీ, వృత్తిపరమైన వాతావరణంపై అది ప్రభావం చూపకూడదు. ఇది ఆమోదయోగ్యం కాదు" అని విన్సీ అన్నారు.

**పవన్ కుమారుడిని కాపాడిన భారత కార్మికులకు.. సింగపూర్ ప్రభుత్వం అవార్డు**

ప్రస్తుతం విన్సీ సోనీ ఆరోపణలు మలయాళ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే ఈ పరిశ్రమలో ఎంతోమంది మహిళలు కాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని జస్టిస్ హేమ కమిటీ గతేడాది ఓ నివేదిక స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో నటి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 2019లో విన్సీ సోనీ ఇండస్ట్రీకి వచ్చారు. 'రేఖ' చిత్రంతో కేరళ రాష్ట్ర ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. ఆమె నటించిన 'జనగణమన' చిత్రం మంచి ఆదరణ సొంతం చేసుకుంది.

# సూపర్ ఓవర్‌లో రాజస్థాన్‌పై దిల్లీ క్యాపిటల్స్ విజయం



**రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన సూపర్ ఓవర్ మ్యాచ్‌లో దిల్లీ క్యాపిట్సల్ విజయం సాధించింది.**

ఒత్తిడికి చిత్తయిన రాజస్తాన్ రాయల్స్
మెరిసిన స్టార్క్, రాహుల్



దిల్లీ: రాజస్థాన్ రాయల్స్‌తో సూపర్ ఓవర్‌కు దారితీసిన మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన దిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 188 పరుగులే చేసింది. దీంతో మ్యాచ్ టై అయి.. సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో తొలుత రాజస్థాన్ 2 వికెట్లు కోల్పోయి 11 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దిల్లీ 4 బంతుల్లోనే లక్ష్యాన్ని ఛేదించింది. దిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించిన మిచెల్ స్టార్క్‌కు ప్లేయర్ ఆఫ్ ది అవార్డు వచ్చింది. దిల్లీకి ఇది ఐదో విజయం కాగా.. రాజస్థాన్‌కు ఇది ఐదో ఓటమి.

**చెలరేగిన యశస్వి, నితీశ్..**

189 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్‌కు.. జైస్వాల్ (51), సంజు శాంసన్ (31) మంచి శుభారంభం ఇచ్చారు. అయితే శాంసన్ రిటైర్డ్ హర్ట్ కావడంతో వచ్చిన రియాన్ పరాగ్ (8) స్వల్ప స్కోర్‌కు పెవిలియన్ చేరాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన నితీశ్ రాణా (51)తో జట్టు కట్టిన జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఇద్దరు బ్యాటర్లు బౌండరీలతో విరుచుకుపడ్డారు. ఈక్రమంలో 112 పరుగుల వద్ద జైస్వాల్ ఔటైనప్పటికీ నితీశ్ దూకుడు కొనసాగించాడు. 161 పరుగుల వద్ద మూడో వికెట్‌గా నితీశ్ పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో ఆ జట్టు విజయానికి 23 పరుగులు అవసరం కాగా, 19వ ఓవర్లో 14 పరుగులు వచ్చాయి. దీంతో సమీకరణం 6 బంతుల్లో 9 పరుగులుగా మారింది. చివరి ఓవర్లో స్టార్.. తొలి ఐదు బంతుల్లో బంతుల్లో 7 పరుగులే ఇచ్చాడు. రాజస్థాన్ విజయానికి చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా.. రెండో పరుగు తీసే క్రమంలో జురెల్ ఔటయ్యాడు. దీంతో మ్యాచ్ టై అయింది.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దిల్లీ.. అభిషేక్ పోరెల్ (49: 37 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్), కేఎల్ రాహుల్ (38:32 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టబ్స్ (34: 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (14:బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగడంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 2, తీక్షణ, హసరంగ ఒక్కో వికెట్ తీశారు.

## సూపర్ ఓవర్

సూపర్ ఓవర్ రాజస్థాన్ బ్యాటింగ్ ఇలా..
(బౌలర్ స్టార్క్)
తొలి బంతి - డాట్
రెండో బంతి - ఫోర్ కొట్టిన హెట్‌మయర్..
మూడో బంతి - సింగిల్
నాలుగో బంతి - ఫోర్ బాదిన రియాన్ పరాగ్ (నో బాల్)
నాలుగో బంతి - పరాగ్ రనౌట్
ఐదో బంతి - ఒక పరుగు.. జైస్వాల్ రనౌట్

సూపర్ ఓవర్‌లో దిల్లీ విజయ లక్ష్యం 12
సూపర్ ఓవర్‌లో దిల్లీ బ్యాటింగ్ ఇలా.. (బౌలర్ సందీప్ శర్మ)
తొలి బంతి - కేఎల్ రాహుల్ రెండు పరుగులు
రెండో బంతి - రాహుల్ ఫోర్
మూడో బంతి - సింగిల్
నాలుగో బంతి - స్టబ్స్ సిక్స్







# చాహల్‌కు అదే విషయం చెప్పా: శ్రేయస్ అయ్యర్




**బాల్ టర్న్ కావడం గమనించి బౌలింగ్ చేస్తున్న చాహల్‌ను శ్వాస వేగాన్ని నియంత్రించుకొని, తెలివిగా బంతులు వేయమని చెప్పాడు శ్రేయస్ అయ్యర్.**

పంజాబ్ కింగ్స్ , కోల్‌కతా నైట్‌రైడర్స్ కు మధ్య మంగళవారం జరిగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ తన పదునైన వ్యూహాలతో సత్తా చాటాడు. తమ టీమ్ చేసిన 111 పరుగులను కాపాడుకుంటూ... 16 రన్స్ తేడాతో కోల్‌కతాపై విజయం సాధించారు. ఛేదనలో కోల్‌కతా టీమ్ 95 పరుగులకే చతికిల పడింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రేయస్ అయ్యర్ సేన 15.3 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌటైంది. కోల్‌కతా బౌలర్లు హర్షిత్ రాణా 3, వరుణ్ చక్రవర్తి , సునీల్ నరైన్ తలో రెండు వికెట్లు తీశారు. కోల్‌కతా విజయం ఇక లాంఛనమే అనుకున్నారు అంతా! ఆ ఆనందంలో బ్యాటింగ్ ప్రారంభించిన కోల్‌కతాకు చాహల్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. కేవలం 28 పరుగులు ఇచ్చి 4 వికెట్లు కూల్చాడు. ఇది అతనికి ఐపీఎల్ కెరీర్‌లోనే బెస్ట్ గణాంకాలు. ఐపీఎల్‌లో అతి తక్కువ పరుగులు చేసి... విజయం సాధించిన టీమ్‌గా కూడా పంజాబ్ రికార్డు సాధించింది.

## అయ్యర్ చెప్పాడు.. చాహల్ చేశాడు...!

కోల్‌కతా బ్యాటింగ్‌కు వచ్చిన సమయంలో శ్రేయస్ అయ్యర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించాడు. పిచ్ ప్రవర్తిస్తున్న తీరును పసిగట్టాడు. ఆ మేరకు చాహల్‌కు దిశానిర్దేశం చేశాడు. 'నేను ఆ సమయంలో బాల్ కాస్త టర్న్ అవడాన్ని గమనించా. అప్పుడు నేను చాహల్‌ను శ్వాస మీద నియంత్రణ సాధించు, కాస్త కూల్‌గా ఉండు అని చెప్పా. కచ్చితత్వంతో బంతు లేసి, మనం బ్యాటర్లను అటాక్ చేయాలని సూచించా' అని శ్రేయస్ అయ్యర్ మ్యాచ్ అనంతరం అన్నాడు.



## 'మేం చెప్పకోదగ్గ స్కోరే చేశాం...'

పిచ్ పరిస్థితులను బట్టి చూస్తే తాము చేసింది సరైన స్కోరే అని శ్రేయస్ అభిప్రాయపడ్డాడు. 'నేను ఎప్పుడైతే బ్యాటింగ్‌కు వెళ్లానో.. అప్పుడు పిచ్‌పై పడిన బంతి విభిన్నంగా స్పందించింది. ఒక బాల్ ఏమో ఎక్కువ బౌన్స్ అవకుండా తక్కువ ఎత్తులో వచ్చింది. మరో బంతేమో నా బ్యాట్ కింద అంచును తాకింది. మిగతా బ్యాటర్లు కూడా స్వీప్‌షాట్ ఆడటానికి ఇబ్బందిపడ్డారు. నిజాయతీగా చెప్పాలంటే... మేం మొదట బ్యాటింగ్ చేసి.. చెప్పుకోదగ్గ స్కోరే చేశాం. అందుకే 16 పరుగులతో విజయం సాధించాం. పిచ్‌పై బౌన్స్ ఒక్కోసారి ఒక్కోలా వస్తోంది. ఇదే విషయాన్ని నేను మా బౌలర్లకు వివరించా. వారు చేసి చూపించారు. రెండు ఓవర్లలో రెండు వికెట్లు సాధించగానే విజయంపై మాలో ఆశలు రేకెత్తాయి. చాహల్ ఎప్పుడైతే వచ్చి బంతిని తిప్పాడో మాకు మరింత విశ్వాసం కలిగింది. నేను అటాకింగ్ ఫీల్డ్ సెట్ చేశా. బ్యాటర్లకు చాలా దగ్గరగా ఫీల్డర్లను మోహరించా. దీంతో వారు ఒత్తిడిలో తప్పులు చేసి, మా వలలో చిక్కారు. ఈ విజయంతో మేం అతివిశ్వాసానికి పోం. ఇది మాలో మరింత బాధ్యతను పెంచింది. ఇదే స్ఫూర్తితో తర్వాతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తాం' అని శ్రేయస్ అయ్యర్ అన్నాడు.ఆరు మ్యాచులు ఆడిన పంజాబ్ కింగ్స్ ఎనిమిది పాయింట్లతో నాలుగో స్థానానికి వెళ్లింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆరు పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతోంది

# ధోని కాలికేమైంది?



**లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని. మ్యాచ్ ముగిసిన తర్వాత అతడు కుంటుతూ టీమ్ హోటల్‌లోకి వెళ్లాడు.**

చెన్నై: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని. మ్యాచ్ ముగిసిన తర్వాత అతడు కుంటుతూ టీమ్ హోటల్‌లోకి వెళ్లాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అయింది. బహుమతి ప్రదానోత్సవంలోనూ మహి అసౌకర్యంగా కనిపించాడు. మహి గాయపడ్డాడని.. అతడు తర్వాతి మ్యాచ్‌ల్లో ఆడడం కష్టమేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ''ధోని పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నట్లు కనిపించట్లేదు. లఖ్‌నవూ ఇన్నింగ్స్ చివరికి వచ్చేసరికి అతడు లెగ్ సైడ్ పడిన బంతులను అందుకోవడానికి ఇబ్బంది పడ్డట్లున్నాడు. బ్యాటింగ్ చేసేటప్పుడు కూడా వికెట్ల మధ్య చురుగ్గా పరుగెత్తలేదు. కానీ తన శక్తిని కూడదీసుకుని కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి చెన్నైని గెలిపించాడు. లఖ్‌నవూ నుంచి అతడు విజయాన్ని లాగేసుకున్నాడు'' అని టీమ్‌ఇండియా మాజీ ఆల్‌రౌండర్ సంజయ్ బంగర్ అన్నాడు.

మహి మరో రికార్డు: ఐపీఎల్‌లో ఇప్పటిదాకా ఎన్నో ఘనతలను సొంతం చేసుకున్న ధోని.. లేటు వయసులోనూ రికార్డుల వేట సాగిస్తున్నాడు. లఖ్‌నవూతో మ్యాచ్‌లో ఛేదనలో 11 బంతుల్లో అజేయంగా 26 పరుగులు చేసి సీఎస్కేని గెలిపించాడు ధోనికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ పురస్కారం అందుకున్న పెద్ద వయస్కుడిగా ధోని (43 ఏళ్లు) ఘనత సాధించాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ప్రవీణ్ తంబే (42 ఏళ్ల 208 రోజులు; 2014లో కోల్‌కతాపై) నెలకొల్పిన రికార్డును మహి అధిగమించాడు. అయితే తనకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు ఇవ్వాలన్న నిర్వాహకుల నిర్ణయంపై మహి ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ''ఎందుకు నాకీ అవార్డు ఇస్తున్నారు. నూర్ అహ్మద్ గొప్పగా బౌలింగ్ చేశాడు'' అన్నాడు. అరంగేట్ర మ్యాచ్‌లోనే సత్తా చాటిన గుంటూరు కుర్రాడు షేక్ రషీద్‌ను కూడా మహి ప్రశంసించాడు. ''రషీద్ కొన్నేళ్లుగా చెన్నైతో ఉన్నాడు. ఈ ఏడాది నెట్స్‌లో అతడు ఎంతో మెరుగ్గా బ్యాటింగ్ చేశాడు. ఇప్పుడు అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఇది అతడికి ఆరంభం మాత్రమే. సాధికారిక షాట్లతో బౌలర్లపై ఆధిపత్యం చలాయించగల సత్తా రషీద్‌కు ఉంది'' అని ధోని అన్నాడు.



# తనిఖీలో నరైన్, నోకియా బ్యాట్ల విఫలం..

: కోల్‌కతా నైట్ రైడర్స్ , పంజాబ్ కింగ్స్ మధ్య మంగళవారం మ్యాచ్ సందర్భంగా ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. సునీల్ నరైన్ , నోకియా బ్యాట్లను అంపైర్లు తనిఖీ చేయగా పరీక్షలో విఫలమవ్వడంతో అంపైర్లు అనుమతించలేదు. నరైన్, నోకియా బ్యాట్ల మందం ఎక్కువగా ఉండటంతో వేరే బ్యాట్లను తెప్పించి క్రీజులోకి వచ్చారు. కోల్‌కతా నైట్ రైడర్స్ ఓపెనింగ్ జోడీ సునీల్ నరైన్, అంగ్క్రిష్ రఘువంశీ క్రీజులోకి వచ్చినప్పుడు బ్యాట్లను రిజర్వ్ అంపైర్ సయ్యద్ ఖలీద్ తనిఖీ చేశారు. మందం ఎక్కువగా ఉండటంతో నరైన్ బ్యాట్‌ని మార్చమని సూచించారు. అయితే రఘువంశీ బ్యాట్ టెస్టులో పాసైంది. మ్యాచ్ మధ్యలో నోకియా బ్యాటింగ్‌కు వచ్చినప్పుడూ ఇదే జరిగింది. దీంతో వేరే బ్యాటు తీసుకోవాల్సి వచ్చింది. బ్యాట్ల ప్రమాణాలు, పరిమాణం విషయంలో ఐపీఎల్ కొన్ని నియమాలు పాటిస్తోంది. ప్రమాణాలకు అనుగుణంగా బ్యాట్ ఉందా లేదా అనేది అంపైర్లు చెక్ చేస్తున్నారు. చాలా ఏళ్లుగా డ్రెస్సింగ్ రూమ్స్‌లోనే ఈ చెకింగ్ ఉండేది. అలా అక్కడే బ్యాట్లను పక్కనపెట్టేసేవారు. కానీ ఈ ఏడాది మైదానంలో కూడా పరిశీలిస్తున్నారు. అలా నరైన్, నోకియా బ్యాట్లు విఫలమయ్యాయి. ఐపీఎల్ చరిత్రలో ఓ బ్యాటర్ ఇలా మైదానంలోకి వచ్చి బ్యాట్ మార్చడం ఇదే తొలిసారి అని సమాచారం. బీసీసీఐ రూల్స్ ప్రకారం బ్యాట్ వెడల్పు 10.79 సెంటీ మీటర్లకు మించకూడదు. అలాగే బ్యాట్ మందం 6.7 సెంటీ మీటర్ల కన్నా ఎక్కువగా ఉండకూడదు. బ్యాట్ అంచు వెడల్పు 4 సెంటీ మీటర్ల వరకు ఉండొచ్చు. బ్యాట్ పొడవు సైతం 96.4 సెంటీ మీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదు. ఐపీఎల్ ప్రారంభం నుంచే అంపైర్లు ప్లేయర్ల బ్యాట్లను పరిశీలిస్తున్నారు. అయితే ఇంతకు ముందు వారు ఆటగాళ్ల డ్రెస్సింగ్‌రూముల్లో బ్యాట్ల కొలతను తనిఖీ చేసేవారు. కానీ ఈ ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, దిల్లీ క్యాపిటల్స్ ముంబయి ఇండియన్స్ మ్యాచుల నుంచి మైదానంలో, బౌండరీ రోప్ అవతల ఆటగాళ్ల బ్యాట్లను అంపైర్లు తనిఖీ

# టైటిల్ పోరుకు పంకజ్

**ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ పంకజ్ అడ్వాణీ టైటిల్ పోరుకు దూసుకెళ్లాడు.**

ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ పంకజ్ అడ్వాణీ టైటిల్ పోరుకు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో అతడు 1070300తో సహచరుడు ధ్రువ్ సిత్వాలాను చిత్తు చేశాడు. ఆరంభంలోనే రెండు బ్రేక్‌లు సాధించి 400 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచిన పంకజ్.. తర్వాత అదే జోరు కొనసాగించి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. 2016 నుంచి పంకజ్ ఈ టోర్నీలో ఓడిపోలేదు. మరో సెమీస్‌లో డేవిడ్ కాసియర్‌తో భారత ఆటగాడు సౌరభ్ కొఠారి తలపడనున్నాడు.



# చాహల్.. నీ టాలెంట్ మామూలుగా లేదు



లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో డేటింగ్ వార్తల వేళ రేడియో జాకీ మహ్‌వశ్ చేసిన పోస్ట్ మరోసారి నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. మంగళవారం కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ బౌలర్ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. మ్యాచ్ అనంతరం చాహల్ ను ప్రశంసిస్తూ మహ్‌వశ్ తన ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్ట్ చేసింది. అతడితో కలిసి దిగిన సెల్ఫీని షేర్ చేసిన ఆమె .. ''నీ టాలెంట్ మామూలుగా లేదు. అందుకే ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా గుర్తింపు సాధించావ్. అసంభవ్..!'' అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లను చాహల్, మహ్‌వశ్ కలిసి వీక్షించిన సంగతి తెలిసిందే. దీంతో వీరు ప్రేమలో ఉన్నట్లు ఊహాగానాలు మొదలవగా.. ఈ ప్రచారాన్ని వీరిద్దరూ ఖండించారు. అయితే, ఈ మధ్య చాహల్ ఆడుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు మహ్‌వశ్ వచ్చి గ్యాలరీలో సందడి చేస్తోంది. ఇటీవల అతడితో తీసుకున్న సెల్ఫీని పోస్ట్ చేసిన ఆమె.. ''ఇది నీ వాళ్లకు అన్నివేళలా మద్దతుగా నిలుస్తూ, వారి వెనక దృఢంగా నిలుస్తున్నందుకు. నీకోసం మేమందరం ఉన్నాం'' అని వ్యాఖ్య జోడించింది. దీనికి చాహల్ స్పందిస్తూ.. ''మీరు నా వెన్నెముక. నేను ఎంతో ఉన్నతస్థాయిలో నిలిచేందుకు సహకరిస్తున్న మీకందరికీ కృతజ్ఞతలు'' అని రాసుకొచ్చాడు. దీంతో వీరి ప్రేమ బంధం నిజమేనేమో అంటూ నెటిజన్లు గుసగుసలాడుకుంటున్నారు. ఇక, చాహల్ ఇటీవలే తన భార్య ధనశ్రీ నుంచి విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే. కాగా.. మంగళవారం కోల్‌కతా పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో చాహల్ చెలరేగిపోయాడు. తన స్పిన్ మాయాజాలంతో ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. దీంతో పంజాబ్ తన 111 పరుగుల స్వల్ప స్కోరును కాపాడుకొని సరికొత్త రికార్డు సృష్టించింది.